క్లుప్తంగా

దస్తగిరిస్వామికి ప్రత్యేక ఫాతెహాలు



ప్రత్యేక అలంకరణలో దస్తగిరిస్వామి దర్గా

రుద్రవరం: బి.నాగిరెడ్డిపల్లెలోని దస్తగిరిస్వామి దర్గాలో గురువారం భక్తులు ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. గ్రామస్తులంతా ఒక్కటై దర్గాలో మొక్కు చెల్లించాలని నిర్ణయించారు. ఈ మేరకు దర్గాను ప్రత్యేకంగా అలంకరించి ముస్తాబు చేశారు. అనంతరం భక్తులు జెండాలతో ఊరేగింపుగా వచ్చి ఫాతేహాలు సమర్పించారు. అనంతరం కందొర్రి చేసి మొక్కు తీర్చుకున్నారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి దర్గాను దర్శించుకున్నారు.

508 పక్కా గృహాలు పూర్తి

శిరివెళ్ల: మండలంలో 508 పక్కా గృహాలు పూర్తయినట్లు హౌసింగ్ ఏఈ నాగశేఖర్ గురువారం తెలిపారు. మండలానికి 2,871 పక్కా గృహాలు మంజూరు కాగా అందులో 1,809 నిర్మాణాలు మొదలయ్యాయన్నారు. అందులో 508 గృహాల నిర్మాణాలు పూర్తి కాగా 37 గృహాలు స్లాబ్ దశలో ఉన్నాయన్నారు. మరో 78 స్లాబ్‌కు సమీపంలో ఉన్నాయన్నారు. 337 పు నాది దశల్లో ఉన్నాయని చెప్పారు. ఇంత వరకు రూ. 9.60 కోట్ల బిల్లులను లబ్ధిదారులకు చెల్లించామన్నారు. గృహాలు మంజూరైన ప్రతి ఒక్కరు తప్పకుండా ఇళ్లు నిర్మించుకోవాలని లేనిపక్షంలో రద్దు అవుతుందన్నారు.

ఏఈగా కిరణ్‌బాబు

శిరివెళ్ల: మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా కిరణ్ బాబు నియమితులయ్యారు. గత ఏఈ రామాచారి నంద్యాల క్వాలిటీ కంట్రోల్ ఏఈగా బదిలీయయ్యారు. ఇక్కడికి కర్నూలు ప్రాజెక్ట్ నుంచి కిరణ్‌బాబు బదిలీపై వచ్చారు.

విధుల్లో చేరిన అసిస్టెంట్ ఇంజనీర్

నంద్యాల(సిటీ): కర్నూలులో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పని చేస్తూ బదిలీపై నంద్యాల మున్సిపాలిటీకి వచ్చిన హిమబిందు గురువారం విధుల్లో చేరారు. ఇటీవల జరిగిన బదిలీల్లో నంద్యాల మున్సిపల్ కార్యాలయంలోని అసిస్టెంట్ ఇంజినీర్ కళావతి ధర్మవరం బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో వచ్చిన హిమబిందు గురువారం నియామకపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ రవి చంద్రారెడ్డి నుంచి పొందారు.

స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(వ్యవసాయం): పదో తరగతి పేద ముస్లిం విద్యార్థిని, విద్యార్థులు స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవాలని అంజుమన్ ఇస్లామియా అధ్యక్షుడు నశ్యం అబ్దుల్ ఖుద్దూస్ గురువారం తెలిపారు. పదో తరగతిలో 50 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు పై చదువులకు గాను అంజుమన్ సంస్థ రూ.3వేల నగదు అందజేస్తుందన్నారు. ఈ నెల 25 లోపు పూర్తి చేసిన దరఖాస్తులను ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న అంజుమన్ కార్యాలయంలో అందించాలన్నారు.

11న మోడల్ స్కూల్ ప్రవేశానికి పరీక్ష

ఉయ్యాలవాడ: స్థానిక మోడల్ స్కూల్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 11న రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ నూర్జహాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రవేశ పరీక్ష కోసం నమోదు చేసుకున్న విద్యార్థిని, విద్యార్థులు మీ సేవా, ఆన్‌లైన్ ద్వారా హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రానికి ఉదయం 9 గంటలలోగా చేరుకోవాలన్నారు. పూర్తి వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

రైతులకు రసీదు ఇవ్వాలి



ఎరువులను పరిశీలిస్తున్న ఏఓ రాజేంద్రకుమార్

దొర్నిపాడు: విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులకు తప్పక రసీదు ఇవ్వాలని దుకాణ యజమానులకు ఏఓ రాజేంద్రకుమార్ ఆదేశించారు. గురువారం ఆయన మండలంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కాలం చెల్లిన రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సూచించారు. రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చిన శాఖపరమైన చర్యలు తప్పవన్నారు.

గాలీవాన బీభత్సం

మహానంది: మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో గాలీవాన బీభత్సం సృష్టించింది. బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కురిసిన భారీ వర్షం, భీకరగాలులకు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్‌శాఖకు సుమారు రూ.పది లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు ఏఈ ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. మహానంది మండలంలో అరటిరైతన్నలకు తీవ్ర నష్టం వాటిల్లింది. సుమారు 900 ఎకరాల్లో అరటిచెట్లు నేలకొరిగినట్లు ఉద్యానశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

మామిడి.. మరింత మధురం

- మార్కెట్ నిండా మామిడి పండ్లు
- వినియోగదారులకు అందుబాటులో ధరలు
- రూ. 100కే మూడు కిలోలు



అమ్మకానికి ఉంచిన మామిడి పండ్లు

నంద్యాల (న్యూటౌన్): మార్కెట్‌ను మామిడి పండ్లు ముంచెత్తుతున్నాయి. నంద్యాల పట్టణంలో ప్రధాన కూడళ్లు, స్టాళ్లు, బండ్లపై కళకళలాడుతున్నాయి. పైగా చౌక ధరలకే లభిస్తుండటంతో కొనుగోలు చేసేందుకు పండ్ల ప్రియులు ఆసక్తి చూపుతున్నారు. సీజన్ ఆరంభంలో ధర కాసింత ఎక్కువగా ఉండటంతో మధ్యతరగతి ప్రజలు రుచి ఆస్వాదించలేకపోయారు. అయితే పక్షం రోజుల నుంచి మార్కెట్‌లో ధర తక్కువగా ఉండటంతో మామిడి ప్రియుల పంట పండుతోంది. నెల క్రితం కిలో రూ.60–70 ధర పలికిన మామిడిపండ్లు ఇప్పుడు రూ.35–40 రూపాయలకే లభిస్తున్నాయి. ప్రస్తుతం బంగినపల్లి, స్వర్ణ రేఖ, రసాలు వంటి పండ్లు మూడు నాలుగు కిలోలు రూ. వందకే లభ్యమవుతున్నాయి. మరి కొన్ని రకాలైతే వందకు ఐదు, ఆరు కిలోల చొప్పున విక్రయిస్తున్నారు. రోడ్డు పక్కన దుకాణాలు ఏర్పాటు చేసి కొందరు, తోపుడు బండ్లపైన కొందరు, మరి కొందరు పోగులుగా పెట్టి ఎక్కడికక్కడే విక్రయిస్తున్నారు. చౌకగా లభిస్తున్న మామిడి పండ్లను ప్రజలు పెద్ద సంఖ్యలో కొనుగోలు చేస్తున్నారు.

దిగుబడి తగ్గినా..

జిల్లాలో పండిన మామిడి పండ్లు ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు వ్యాపారులు ఎగుమతి చేస్తుంటారు. ఎగుమతి చేయగా మిగిలిన పండ్లను స్థానిక మార్కెట్‌లకు తరలిస్తుంటారు. వాస్తవానికి వరుసగా రెండేళ్లుగా ఆశించిన దిగుబడి లేదు. 50 శాతానికి మించి దిగుబడి లేదు. దిగుబడి తగ్గినా సంవత్సరం ధరలు అధికంగా ఉంటాయి. కానీ ఈ సంవత్సరం అందుకు భిన్నంగా ఉంది. కాపు తగినా ధర మాత్రం సరసంగానే ఉంది. ఎగుమతులు క్షీణించడంతో ఈ ఏడాది మామిడి ధర తగ్గడానికి కారణమని వ్యాపారులు చెబుతున్నారు. జిల్లాలో విక్రయించేవారు గాజులపల్లె, గిద్దలూరు, ఎంబాయి, బనగానపల్లె, అనంతపురం తదితర ప్రాంతాల నుంచి హోల్‌సేల్‌గా కొనుగోలు చేస్తున్నారు. 20 కిలోల మామిడి పండ్లు రూ. 200 నుండి 250గా విక్రయిస్తున్నారు.

రోజుకు 200 కిలోలు విక్రయిస్తున్నాను



ప్రస్తుతం మార్కెట్‌లో పూర్తిగా పక్వానికి వచ్చిన పండ్లు ఉన్నాయి. వీటి రుచి బాగుంటుంది. ధర కూడా అందుబాటులో ఉండడంతో విక్రయాలు బాగున్నాయి. రోజుకు 200 నుంచి 300 కిలోలు విక్రయిస్తున్నా. గతంలో 50 కిలోలు అమ్ముడు పోవాలంటే చాలా కష్టంగా ఉండేది. ఈ నెలాఖరు వరకు సీజన్ ఉంటుంది.

– లచ్చమ్మ, పండ్ల విక్రేత, గాజులపల్లె

ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం



బెక్కెం నాగేశ్వరరెడ్డిని అభినందిస్తున్న దృశ్యం

గోస్పాడు: యాళ్లూరు గ్రామ ఉప సర్పంచ్‌గా బెక్కెం నాగేశ్వరరెడ్డి గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఎన్నికైన ఉప సర్పంచ్ శకుంతలమ్మ రాజీనామా చేయడంతో ఖాళీ అయిన ఈ స్థానానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు గురువారం ఎన్నిక నిర్వహించారు. పంచాయతీ విస్తరణాధికారి నాగేంద్రుడు ఆధ్వర్యంలో 14 మంది వార్డు మెంబర్లు, సర్పంచ్ ఎన్నికలో పాల్గొనాల్సి ఉంది. అయితే 9 మంది వార్డు మెంబర్లు,సర్పంచ్ పాల్గొని 8వ వార్డు మెంబరుగా ఉన్న బెక్కెం నాగేశ్వరరెడ్డిని ఉప సర్పంచుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పంచాయతీ అధికారులు, గ్రామస్తులు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు. అనంతరం బెక్కెం నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ అధికారుల సహకారంతో గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

రహదారి పనులు త్వరితగతిన పూర్తి చేయండి

- మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

నంద్యాల(సిటీ): పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న పద్మావతి నగర్ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఇంజినీరింగ్ అధికారులనుఆదేశించారు. గురువారం ఆయన రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి నిర్మాణంలో నాణ్యత లోపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అదేవిధంగా డ్రెయిన్లు త్వరగా నిర్మించాలని, రోడ్డులో ప్రయాణించే వాహనదారులకు సూచికలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం శ్రీనివాస నగర్‌లో చేస్తున్న స్పెషల్ శానిటేషన్ పనులపై ఆరా తీశారు. పారిశుద్ధ కార్మికులకు అవసరమైన పనిముట్లు అందజేయాలని సూచించారు.

క్రైం కార్నర్

తల్లీకుమారుడికి గాయాలు





ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంతోష్, మరియమ్మ

చాగలమర్రి: పెద్ద బోదనం సమీపంలో బైక్ అదుపు తప్పిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పెద్ద బోధనం గ్రామానికి చెందిన తల్లి మరియమ్మ, కుమారుడు సంతోష్ పని మీద ఆళ్లగడ్డకు వెళ్లి తిరిగి వస్తుండగా గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని స్థానికులు 108లో ఆళ్లగడ్డకు తరలించారు. సంతోష్ పరిస్థితి మిషమంగా ఉండటంతో నంద్యాలకు తరలించారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

నంద్యాల టౌన్: ఆళ్లగడ్డ మండలం మిట్టపల్లెకు చెందిన కె. వీరయ్య(25)గా పాణ్యం రైల్వే స్టేషన్‌లో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే ఎస్‌ఐ జలీల్ ఖాన్ తెలిపిన వివరాల మేరకు.. సంఘటన స్థలంలో లభించిన ఆధారాల ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. బనగానపల్లె మండలం పలుకూరు గ్రామానికి చెందిన సుభాషిణితో మృతుడికి వివాహమైంది. వీరికి ఓ కుమార్తె సంతానం. అయితే, భార్యాభర్తల మధ్య మనస్పర్థలే ఈ ఆత్మహత్యకు కారణమని తెలుస్తోందని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ..

ఆళ్లగడ్డ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు కోలుకోలేక మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. ప్రొద్దుటూరు సమీపంలోని రామేశ్వరానికి చెందిన గురు ఆంజనేయులు (29) గత నెల 16వ తేదీన బైక్‌పై నంద్యాలకు వెళ్తూ బత్తలూరు సమీపంలో అదుపు తప్పి కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన ఆంజనేయులును కర్నూలు వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తుండగా కోలుకోలేక గురువారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.

240 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యంతో పట్టుబడిన లారీ

చాగలమర్రి: అక్రమంగా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సీఐ నాగరాజు యాదవ్ తెలిపిన వివరాల మేరకు.. వెలుగోడు నుంచి మైదుకూరుకు భారీగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం అందడటంతో జాతీయ రహదారిపై మద్దూరు మెట్ట సమీపంలో దాడి చేసి బియ్యం లారీని పట్టుకున్నారు. 240 బస్తాల బియ్యం, లారీ స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. లారీ డ్రైవర్ భాస్కర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. దాడిలో సీఐతో పాటు విజిలెన్స్ హనుమంతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

ఆళ్లగడ్డ: నందింపల్లె గ్రామంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామానికి చెందిన అనిల్‌కుమార్, శిరీష (30) దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శిరీష కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధ పడుతోంది. వైద్యులకు చూపించినా నయం కాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందింది. బుధవారం రాత్రి కుటుంబీకులు అందరూ గ్రామంలో జరిగే బంధువుల వివాహానికి వెళ్లగా ఇంట్లో ఒంటరిగా శిరీష విషద్రావణాన్ని తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబీకులు ఆళ్లగడ్డ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందింది. మృతురాలి తల్లి బాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరసింహులు గురువారం తెలిపారు.



ఆత్మహత్య చేసుకున్న శిరీష

గోస్పాడు ఎంపీడీఓగా భాస్కర్



గోస్పాడు: గోస్పాడు ఎంపీడీఓగా గుర్రాల భాస్కర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న సుగుణశ్రీ నంద్యాలకు బదిలీ అయ్యారు. ఆ స్థానంలో నంద్యాలలో పని చేస్తున్న భాస్కర్‌ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు అందజేశారు. బాధ్యతల చేపట్టిన తర్వాత ఆయన దీబగుంట్ల సచివాలయాన్ని పరిశీలించారు. గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా చూడాలని, ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్న తాధికారుల దృష్టికి తీసుకురావాలని సచివాలయ, పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఆయన వెంట ఈఓఆర్‌డీ నాగేంద్రుడు, పంచాయితీ సిబ్బంది ఉన్నారు.

జాబ్ కార్డుదారులందరికీ ‘ఉపాధి’ కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శేఖర్

నంద్యాల(న్యూటౌన్): జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులు కల్పించాలని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, నంద్యాల జిల్లా సీపీఐ ప్రధాన కార్యదర్శి రంగనాయడు డిమాండ్ చేశారు. గురువారం నంద్యాలలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులందరికీ ఇంటి స్థలాలతో పాటు జగనన్న కాలనీలో పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో కోనేరు రంగారావు భూకమిటీ సిఫారసులు అమలు చేసి భూమి లేని వారికి భూ పంపిణీ చేయాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం భవిష్యత్తులో పేదల సమస్యల కోసం పోరాటాలు చేస్తుందన్నారు. సమావేశంలో సీపీఐ సహాయ కార్యదర్శి బాబ ఫక్రుద్దీన్, జిల్లా కార్యదర్శి రాదకృష్ణ, టీ ప్రతాప్, మహేశ్వరమ్మ, ఏసేపు, వరదరాజులు, విజయుడు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారమే ధ్యేయం

- ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి



ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి చంద్ర కిశోర్‌రెడ్డి

నంద్యాల: పేదల సొంతింటి కల సాకారం చేయడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే శిల్పారవి చంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని భవన నిర్మాణ కార్మికులకు వైఎస్సార్ నగర్‌లో స్థలాలు కేటాయించి పట్టాలు పంపిణీ చేశారు. వైఎస్సార్ హయాంలో శిల్పా మోహన్ రెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో పట్టణంలో భవన నిర్మాణ కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఆ స్థలాలు టిడ్కో ఇళ్లకు కేటాయించిన ప్రాంతంలో ఉండటంతో వారు స్థలాలు కోల్పోయారు. వారికి అక్కడే ఖాళీగా ఉన్న స్థలాలను కేటాయించి 30 మంది భవన నిర్మాణ కార్మికులకు ఇళ్ల పట్టాలకు పంపిణీ చేశారు. గురువారం నిర్వహించిన పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు తమ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుంటే టీడీపీ నాయకులు కోర్టులకు వెళ్లి అడ్డుకోవడం దారుణమన్నారు. మంచి వారి సంకల్పానికి దేవుని ఆశీస్సులు తోడుగా నిలిచి విజయం సాధించామన్నారు. గత నెలలో 3,006 మంది పేద అక్కా చెల్లెమ్మలకు ఎస్సార్బీసీ కాలనీ సమీపంలో ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలను పంపిణీ చేశామన్నారు. రానున్న రోజుల్లో మరో 1000 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలలు పంపిణీ చేస్తామన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఇళ్ల నిర్మాణానికి హౌసింగ్ ద్వారా రూ.80 వేలు, పొదుపు మహిళలకు అదనంగా రూ.35 వేలు ఆర్థిక సాయం అందజేయడం జరుగుతుందన్నారు. గృహ నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ, శ్రీనివాసులు, తహసీల్దార్ శ్రీనివాసులు, వైసీపీ నాయకులు జాకీర్‌హుస్సేన్, రమణ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ కమిషన్ ఏర్పాటు హర్షణీయం

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయడంపై పీఆర్‌టీయూ హర్షం వ్యక్తం చేసింది. గురువారం స్థానిక కార్యాలయంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. సీపీఎస్ స్థానంలో ఓపీఎస్ అమలు చేయాలని కోరారు. సమావేశంలో విజయరావు, షుద్రక్, బాబు, శ్రీనివాసులు, భాస్కరుడు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రామసుబ్బయ్యపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(అర్బన్): వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ రామసుబ్బయ్యపై చర్యలు తీసుకుని వెంటనే అరెస్టు చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ నాయక్, బాలనాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమాయక గిరిజనులను నమ్మించి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని సరిఫికెట్లు తీసుకుని మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. సమావేశంలో నంద్యాల జిల్లా అధ్యక్షులు విజయ్‌నాయక్, విక్రమ సింహనాయక్, సుధాకర్ నాయక్, రాంబాలజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని పూర్తి చేయాలి

ఆళ్లగడ్డ: ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని డ్వామా ఏపీడీ సాంబశివరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగు చేసే రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల వారీగా కేటాయించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీడీ వెంట ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్, ఏపీఓ గణేష్, ఎఫ్ఏ, టీసీలు ఉన్నారు.

రైతుల అభ్యున్నతే ప్రధాని లక్ష్యం

నంద్యాల(వ్యవసాయం): రైతుల అభ్యున్నతే ప్రధాని నరేంద్ర మోదీ ధ్యేయమని ఉమ్మడి కర్నూలు జిల్లా బీజేపీఅధ్యక్షుడు బుడ్డా శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణ కిసాన్‌మోర్చ ఆధ్వర్యంలో స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో బీజేపీ నాయకుల విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిసాన్‌మోర్చ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన 13వ విడత నిధులు త్వరలో విడుదల అవుతుందన్నారు. రైతులకు పెట్టుబడి సాయంగా సంవత్సరానికి రూ.6 వేల చొప్పున మూడు విడతల్లో నాలుగు సంవత్సరాలకు గాను రూ. 24వేలు రైతుల ఖాతాలలో వేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది జూన్ నెలలో 13వ విడత రెండు వేల రూపాయలు రైతుల ఖాతాల్లో పడనున్నాయన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మండ్ల గంగాధర్, కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ రాజు, బీజేపీ నాయకులు శివారెడ్డి, రామకృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, డాక్టర్ ఇంటి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓకు స్వాగతం పలుకుతున్న ఎంపీపీ, మండలాధికారులు

నంద్యాల(రూరల్): నంద్యాల మండలం ఎంపీడీఓగా సుగుణశ్రీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓకు మండల అధ్యక్షులు శెట్టి ప్రభాకర్, కార్యాలయం ఏఓ శివప్రసాద్‌రెడ్డి, ఈఓఆర్డీ మహీధర్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూగ్రామాల అభివృద్దే ధ్యేయంగా పని చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు.

వృద్ధాశ్రమాల ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

నంద్యాల(అర్బన్): జిల్లాలో వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయాలనుకునే, నిర్వహించే వారు రిజిస్ట్రేషన్ తప్పని సరిగా చేయించుకోవాల్సి ఉందని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారం తప్పని సరిగా నిబంధనలు పాటించాలన్నారు. ఇదివరకే వృద్ధాశ్రమాలు నిర్వహిన్నా వెంటనే రిజిస్ట్రేషన్ సర్టిఫికెటు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం రూ. 25 వేల జరిమానా తోపాటు శిక్షకు గురవుతారన్నారు.

అరసం జిల్లా కమిటీ ఆవిర్భావం



నంద్యాల జిల్లా అభ్యుదయ రచయితల సంఘం కమిటీ సభ్యులు

నంద్యాల(న్యూటౌన్): అభ్యుదయ రచయితల సంఘం నూతన కమిటీని గురువారం ఏర్పాటు చేశారు. నూనెపల్లె భగత్ సింగ్ జనచైతన్య గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడిగా ముర్తుజా, ఉపాధ్యక్షులుగా డాక్టర్ నీలకంఠం ఆచారి, విజయదుర్గ, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్. మద్దిలేటి, సహాయ కార్యదర్శులుగా మహబూబ్ బాషా, మహమ్మద్ రఫీ, ప్రసాద్‌లను ఎన్నుకున్నారు. అలాగే నంద్యాల జిల్లా కమిటీ గౌరవాధ్యక్షులు డాక్టర్ కళామురళి, కార్యవర్గ సభ్యులుగా బాలరాజు, కన్నయ్య, జ్యోతి లక్ష్మీ, మురళీధర్, ఓబులేసు, రామకృష్ణారెడ్డి, సయ్యద్, రవికుమార్, వై కృష్ణుడు, మల్లేశ్వర్ ఎన్నికయ్యారు. జిల్లా అరసం అధ్యక్షుడు ముర్తుజా మాట్లాడుతూ అభ్యుదయ రచయితలకు అరసం ఒక చక్కని వేదిక అని, రచయితలంతా సమాజం పట్ల బాధ్యత కలిగి మెలగవలసిన అవసరం ఉందన్నారు.

వంద శాతం గ్రౌండింగ్ చేయాలి

ఆళ్లగడ్డ: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వంద శాతం గ్రౌండింగ్ కావాలని ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్ సూచించారు. స్థానిక కార్యాలయంలో గురువారం మండల స్థాయి అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని జగనన్న కాలనీల్లో ఇప్పటికీ 180 మంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేపట్టలేదని, వారం దరూ త్వరలో ఇళ్ల నిర్మాణం చేపట్టి బేష్‌మెంట్ లెవల్‌కు తీసుకు వచ్చే విధంగా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. నిరుద్యోగుల కోసం ప్రభుత్వం స్కిల్‌హబ్ యాప్‌ను రూపొందించిందని ఈ యాప్‌పై యువతకు అవగాహన కల్పించాలన్నారు. ఒక్కో సచివాలయ పరిధిలో కనీసం 100 మంది చొప్పున మండలంలో 1,200 మంది యువతీ యువకులు యాప్‌లో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.